దు( )రాలోచన

బేతనపల్లి బోస్, Fairlawn, NJ

New York
June 10, '95

గంగా భాగీరథీ సమానురాలైన అత్తమ్మకు,

నరసింహం నమస్కరించి వ్రాయునది. సుదీర్ఘమైన మీ ఉత్తరం నిన్ననే జేరింది. తండ్రి సంవత్సరీకానికి పిల్లలు రాలేక పోయారు అంటూ బాధగా వ్రాశారు. చిన్నప్పటి నుండి ఆడిన ఆటలు, మాటలు, పాడిన పాటలు, సరదాలు, సంతోషాలు, ప్రేమలు, ఆప్యాయతలు, పెద్దయిన తరువాత, పిల్లలు ఎలా మర్చిపో గలిగారు? అంటూ ప్రశ్నించారు. జయంతి అయినా, వర్ధంతి అయినా, దేశనాయకుడో, సినిమా స్టారో, బాగా డబ్బున్న మనిషి అయితే తప్ప, కేవలం, నా బిడ్డలు, వాళ్ళ భవిష్యత్తు అనుకొని, వంచిన తల ఎత్తకుండా, జీవితమంతా కష్టపడి, పిల్లల భవిష్యత్తుకు ఒక దారి చూపించి చప్పుడు చెయ్యకుండా వెళ్ళిపోయిన సాధారణ మనిషైన నాన్నగారంటే ఇచ్చే గుర్తింపు ఇదేనా? పిల్లలు ప్రవర్తించ వల్సిన తీరు ఇదేనా? అంటూ నిగ్గ తీసి అడిగారు.

పిల్లలకు ఒంట్లో కాస్త నలతగా వుంటే తన వంట్లో బండ పడ్డట్టు బాధ పడిన తండ్రిని, పరిగెత్తినట్లే వాళ్ళను డాక్టరు దగ్గరకు తీసుకెళ్ళి నయం అయ్యే వరకూ, మందు క్రమం తప్పకూడదని నిద్ర మానుకొని వాళ్ళ బెడ్స్ ప్రక్కనే జాగారం చేసిన తండ్రిని, కష్ట నష్టాలకు తట్టుకొంటూ వాళ్ళను కాలేజీలకు పంపి, మంచి ఉద్యోగాలు వచ్చి నట్లు చేసిన తండ్రిని, పెళ్ళిళ్ళు, పేరంటాలు జరిపించి ఒక ఇంటి వాళ్ళను చేసిన తండ్రిని పిల్లలు ఎలా మర్చిపోగలరు? అంటూ దీనంగా వ్రాశారు.

రాబడి బాగానే వున్న ఉద్యోగాల్లో వున్నారు. డబ్బుకు ఇబ్బంది లేనప్పుడు వచ్చి వెళ్ళడానికి ఇబ్బంది ఏమిటి? బహుశా కోడళ్ళు వెళ్ళనివ్వ లేదేమో అన్న అనుమానం వ్యక్తం చేశారు. ఏనాడో చేసుకొన్న పాపమో! శాపమో! ఇలా అనుభవించాల్సి వస్తుంది అంటూ విచారంగా వ్రాశారు.

అత్తమ్మా! మీరు మీ పిల్లల్ని చిన్నప్పటి నుండి చాలా డిసిప్లిన్‌తో పెంచారు. వేళకు లేవడం, చకచకా పనులు చేసుకోవడం నేర్పారు. స్కూలు రోజు అయినా, శలవు రోజయినా, పండుగ రోజయినా అదే రూలు. పెట్టింది తినాల్సిందే గాని ఎదురు ప్రశ్నలకు ఛాన్సు కాదు. నీట్‌గా తయారయ్యి స్కూలుకి వెళ్ళి, తిన్నగా ఇంటికి రావడమే జరిగింది. స్కూల్లో ఆటలు ఆడ లేదు, గెంత లేదు. ఒంటికి దెబ్బలు, బట్టకు మట్టి. అంతేగా! వాళ్ళు వర్షంలో తడవనూ లేదు వడగళ్ళు ఏరనూ లేదు. వానా వానా వల్లప్ప అని పాటలు పాడనూ లేదు. తడిస్తే జలుబు, ఆపైన జ్వరం. వాళ్ళు గాలిపటాలు ఎగుర వెయ్యనూ లేదు. వాళ్ళ ముడుకులు కొట్టకు పోనూ లేదు. శ్రద్ధగా మాత్రం చదివారు. మంచి మార్కులతో ప్రతి సంవత్సరం పాస్ అవుతూ మీకు మంచి పేరు తెచ్చారు. పిల్లలు బుద్ధిమంతులు, తల్లిదండ్రుల మాట జవదాటరు అని నలుగురూ అనుకొనేలా చేసి మీకు ఎంతో గర్వం కల్గించారు. చూస్తుండగానే పెద్దవాళ్ళు అయ్యారు. ఉద్యోగాలు రావడం పెళ్ళిళ్ళు చెయ్యడం జరిగింది. అత్తమ్మా! మీ పిల్లలు ఇప్పటికీ బుద్ధిమంతులే. చిన్నప్పుడు మీమాట ఎలా విన్నారో ఇప్పుడు మీ కోడళ్ళమాట అలానే వింటున్నారు. మీ అబ్బాయిలు మారలేదు. వాళ్ళ మీద అజమాయిషీ మారింది అంతే. వాళ్ళు ఉదయం నుండి సాయంత్రం వరకూ ఎవరి ఆధీనంలోనో ఉండక తప్పదు. వాళ్ళు అలా పెరిగి పోయారు. వెనుక తల్లిగాని, భార్యగాని ఉండేది. మూడు రోజులు భార్య పుట్టింటికి వెళ్తే జీవితాలు తల్లక్రిందులై పోయేవాళ్ళు. చాలామంది ఈ తరగతిలో ఉన్నారు.

ఉద్యోగంలో దిట్ట అయినవాడు ఇంటి వ్యవహారాల్లో శుంఠ అని మీరు అనుకోనక్కర లేదు. తండ్రి సంవత్సరీకం అని తెలియని కొడుకు వుండడు. తెలిసినా పట్టించుకోలేని కుసంస్కారం అనుకొనే బదులు ఏ ఇబ్బందుల వల్ల రాలేకపోయాడో అనుకొంటే బాగుంటుందేమో! పెళ్ళి చేసుకొని అందరినీ వదలి పెట్టుకొని భర్తే సర్వస్వం అనుకొని వచ్చిన కోడళ్ళను తప్పు పట్టడం కంటే, దీపం వుండగానే ఇల్లు చక్కబెట్టుకొనే కోడళ్ళు వచ్చినందుకు సంతోష పడాలి, గర్వ పడాలి.

పెళ్ళి అయిన స్త్రీకి భర్త మీద, పిల్లల మీద, ఇంటి మీద ఒక అధికారం వస్తుంది. కొన్ని సంవత్సరాలుగా సాగిన మీ అధికారం ఇప్పుడు చప్పబడిపోయింది. బిజీగా వుండే మనిషికి పదవి పోయిన తరువాత ఉండే తీరుబడి వల్ల చేతిలో నుండి ఏదో జారిపోయినట్లు, జీవితం డొల్ల అయిపోయినట్లు కలిగే భావన సరైనదే. మామయ్య ఉన్న ఇల్లు మీకు స్వర్గం. పిల్లలు మీ ఆధీనంలో లేరన్నది నిజం. మీరు గడిపిన, జీవిత పుస్తకంలో ప్రతి పేజీ ఒక వింత అనుభవం. మధుర స్మృతి. మీకు మీ ఇల్లు కావాలి, భర్త కావాలి. పిల్లలు కావాలి. మధుర స్మృతులు కావాలి. నిజంలో వుండే చేదు భరించ లేక మీ మనస్సు చేసే మారామే మీకు శాపంగానో, పాపంగానో పరిణమించింది. మార్పూగా ఉంటుంది. నా దగ్గరకు వచ్చి వుండమన్నా మీరు నిరాకరించారు. ఆ ఇంట్లోనే ఉంటూ జ్ఞాపకాల పంజరంలో చిక్కుకొని బాధ పడుతున్నారు. నిజం గ్రహించి కాలానికి అనుగుణంగా మారినప్పుడే మీకు శాపవిమోచనం, మనసుకు శాంతి అని గ్రహించ గలరు.

ప్రేమతో,
మేనల్లుడు నరసింహం

****

New York
July 10, 1996

ప్రియమైన అత్తమ్మకు,

నరసింహం నమస్కరించి వ్రాయునది. మీ చేతి వ్రాత చిర పరిచయమే నాకు. మెయిల్ బాక్సులో మీ ఉత్తరం చూడగానే ఆత్రం నాకు తెలియకుండానే నాలో చోటు చేసుకోవడం, టకటకా చదివేయడం ఓ అత్తమ్మా అని గెంతు వేయడం జరిగింది. ఇంత త్వరగా, మీ దగ్గరనుండి జవాబు రావడం సంతోషం.

మనం ఎంతమందినో కలుస్తాము, మాట్లాడతాము. కానీ ఎంత మంది దగ్గర ఆత్మీయంగా ఫీల్ అవగలం? మనసు విప్పి మాట్లాడుకోగలం? నీతో మాట్లాడినా, నీ దగ్గర నుండి ఉత్తరం వచ్చినా మనసుకు ఎంతో బాగుంటుందని వ్రాశారు.

నాకు కూడా అత్తమ్మా, మీ దగ్గర నుండి ఉత్తరం వచ్చినప్పుడు అలానే ఉంటుంది. మీరు వ్రాసినట్లు పార్టీలు అంటే సంతోషం పంచుకొనేదానికే. కష్టాలు పంచుకొనేదానికి ఒక్క మనిషి వుంటే చాలని వ్రాశారు. మనసు మార్చుకొని నా దగ్గరకు వచ్చి వుండేదానికి నిర్ణయించుకొన్నట్లు వ్రాశారు. మహా సంతోషం.

ఈలోగా మీ వల్ల జరగ వల్సిన కార్యం ఒకటి వుంది. ఒంటరిగా వున్న మీకు ఒక తోడు కూర్చి, జతగా వచ్చే ఏర్పాట్లు చేయగలవాడను. అపార్థం చేసుకోకండి.

నాగురించి – ఫార్మసీ బాగా సాగుతుందా? రాబడి ఎలా వుంది అని ప్రశ్నించారు. ఏం చెప్పమంటారు? పరిస్థితులు మారి పోతున్నాయి. HMOs అనే తుఫాను పడమర పసిఫిక్ మహాసముద్ర తీరం నుండి, తూర్పున అట్లాంటిక్ మహాసముద్ర తీరం నుండి, రెండువైపులా అడకత్తెరలో పోకచెక్కను నొక్కినట్లుగా తడి బట్టను రెండు చేతులతో పిండి అవతల పారేసినట్లుగా, మెడికల్ ఫీల్డుని కంట్రోలు చేసుకు వస్తున్నారు. దాని ఫలితంగా దేశం మొత్తంమీద వారానికి ఒక హాస్పిటల్ మూత పడిపోతుంది. డాక్టర్సుకి రాబడి తగ్గిపోతుంది. ఉద్యోగస్తులకు ఇంక్రిమెంట్సు లేవు. ఉన్న వుద్యోగాలకు దిక్కు లేదు. నిరుద్యోగం పెరుగుతుంది. అందరి ఆదాయం తగ్గుతుంది. HMO తుఫాను ముగిసే నాటికి నా బిసినెస్ మూల పడిపోవచ్చు. చచ్చినవాళ్ళు చావగా మిగతా వాళ్ళకు మోకాళ్ళోతు కూడు అన్నాట్ట బ్రహ్మంగారు!

కాలం మారిందని వ్రాశారు. నిజమే భూగోళం మీద 24 టైమింగు జోన్సు వున్నాయి. ఒక జోన్ నుండి మరో జోన్ లోకి వెళ్ళినప్పుడల్లా టైమ్ మారుతూనే వుంటుంది. అదే సూర్యుడు, అదే చంద్రుడు. పాత రాతి యుగంలో మనిషి కొండ గుహల్లో వుంటే నేటి మనిషి ఆ కొండరాళ్ళను మార్చుకోగా మలచుకొని మనుగడ చేస్తున్నాడు. అప్పుడు కాల్చుకొని తింటే ఇప్పుడు మరీ మసాలా తగిలించి తింటున్నాడు. వెనక్కి తిరిగి చూస్తే మనిషి తెలివిలో ఎంత అభివృద్ధి సాధించాడో స్వార్థంలో అంతకు మించి ఎదిగిపోయాడు. రంగు రంగులానే వుంది దిక్కుమారిపోయిందన్నట్లు, మనిషి మనిషిలాగే వున్నాడు, బుద్ధి మారిపోతూనే వుంది. అవసరాలను బట్టి, పరిస్థితులను బట్టి, నేనూ మారక తప్పడం లేదు. అర్థం చేసుకో గలరు. పురుష ప్రయత్నం అన్నారు. అందుకే మళ్ళీ పెళ్ళి చేసుకోవాలని నిర్ణయించుకొన్నాను. ఆశ్చర్య పోకండి. ఈ దిగువ వ్రాసినట్లు ప్రకటించ గలరు.

పేరు : నరసింహం. పేరులోనే సింహం. పూర్తిగా నరుణ్ణే. నమ్మండి.

ఎత్తు : 5' 10" అమెరికన్స్ తో పోల్చదగ్గ ఎత్తు.

బరువు : 150 పౌ. అమెరికాలో ఏపుగా పెరిగి కాలేజీకి వున్న ఏ కుర్రాడు అయినా వుండే బరువు.

వయస్సు: 50 సం. ఇండియాలో 40 సం. వయస్సు గలవాడిని చూస్తే మీకు కన్పించేది డొక్కు పోయిన ముఖం, ఒడలి పోయిన శరీరం, భారంతో వంగి పోయిన నడుం, జీవం లేని నవ్వు, సారం తీసేసిన చెరుకు గడలా, రాదర్ పిప్పిలాకన్పిస్తాడు.నేను పేరుకేఫిఫ్టీ.నన్నుచూచిలొట్టలెయ్యకపోతే ఒట్టు! అందుకే 'you got to see to believe it' అన్నారు.

జుత్తు : ఎంతో ఒత్తు. Salt and pepper combination. Symbol for maturity అనుకోండి. Oil రాసే అలవాటు లేక అలా అయ్యింది. అంతే.

దృష్టి: పగలు 20/20. రాత్రిళ్ళు key hole ఎప్పుడూ మిస్ కాలేదు.

ముక్కు: సూది. ముక్కుకు సూటిగా పోవడమే అన్నమాట. తిండి రుచితో పాటు, డబ్బు వాసన కూడా పసి కట్టేస్తుంది.

నోరు : పళ్ళన్నీ నా సొంతం. నత్తి లేదు. తిన్నగా మాట్లాడడమే తప్ప డొంక తిరుగుడు, అబద్ధాలు రావు. I mean ఆడదు.

చెవులు : చక్కగా బుర్రకు దగ్గరగా శంఖాన్ని ఫ్లాట్గా చేసి అతికించినట్లుగా వుంటాయి. దేవుడి పూజ చేసి పువ్వులు పెట్టుకోవడమే తప్ప ఎవ్వరికీ చెవుల్లో పువ్వులు పెట్టవు.

వినికిడి : అమోఘం. I hate your guts అని ఎంత నిశ్శబ్దంగా అన్నా తప్పకుండా వినిపిస్తుంది. నా would be అంటే విన్పిస్తుంది. అన్యులకు ఆ chance లేదు.

రంగు : నిగ నిగలాడే నిమ్మపండు రంగు. lemon expression నాకు applicable కాదు. నిజం.

కులం,

గోత్రం,

నక్షత్రం : ఇందలి location, location, location అన్నట్లు ముమ్మాటికీ అర్థం, అర్థం, అర్థం.

పెళ్ళి : అయ్యింది. (బాధ్యత లేదు.)

పిల్లలు : వున్నారు. (బాధ్యత లేదు.)

కారు : వుంది

ఇల్లు : వుంది.

మార్ట్గేజ్ : ఇంకా, ఇంకా వుంది.

మాట్లాడుకోవల్సింది: ఇంకా, ఇంకా ఎంతో వుంది.

కలిసి చెయ్యాల్సింది : ఇంకా, ఇంకా ఎంతో వుంది.

Hay, what are you waiting for! Bid me out. Good luck... Bid me out. Bid me. Bid...'

P.S. అత్తమ్మా! మనలో మన మాట. ఎవ్వరితో అనరుగా! ఉన్నవాడికి డబ్బు ధైర్యాన్ని ఇస్తుంది. లేనివాడికి చావు ధైర్యం తోడుగా వుంటుంది. మధ్య తరగతి వాడి ధైర్యం అంతంత మాత్రమే. Paper tiger అనుకోండి. డబ్బున్న వాడికి డబ్బే ప్రస్టేజ్ తెస్తుంది. లేని వాడికి ప్రస్టేజ్ ప్రశ్నే లేదు. మధ్యతరగతి వాడే సుడో ప్రస్టేజ్ తో బాధ పడుతుంటాడు. బాధ అనేకంటే వ్యసనం అందామా. వ్యసనానికి ధర్మరాజులాంటి వాడే బానిస అయ్యాడు.

ధైర్యం అనేది సహజంగా వున్నవాళ్ళకే వుంటుంది. లేని వాళ్ళకు రమ్మన్నా రాదు. అయినా లోకం తెలియని వయసులో వున్న ఈ అమ్మాయిలు ఎంత లేతగా వుంటారో, వాళ్ళ మనసులు అంత తియ్యగా వుంటాయి. కొందరు మాత్రం 'we hate men ' అంటూనే వున్నారు. పెళ్ళిళ్ళు చేసుకొంటూనే వున్నారు. పిల్లల్ని కంటూనే వున్నారు. మొత్తం ఆడజాతి అంత కల్సి నాలాంటి వాడి మీద తిరగబడితే తప్ప నాకు పెళ్ళి కాదు అన్న చింత లేదు. ఈ సంవత్సరం అంటే 1996 నుండి మీ కాలం 1920 వరకూ చూస్తే నాకు కన్పించేది కట్నాలు కానుకలు లాంఛనాలే. ఏ తల మాసినవాడికైనా లక్షల్లో కట్నం ఇచ్చి భర్తల్ని కొంటున్నారు. తలమాసిన వాడికే అంత డబ్బు ఇస్తే కాస్త తల నెరసిన వాడికి ఇంకా ఎక్కువే ఇస్తారు. అందులో సందేహం లేదు. మనిషి వీక్నెస్ తెలుసుకొని కెసినోస్ డబ్బులు చేసుకొంటున్నాయి. లిక్కరు షాపులవాళ్ళు డబ్బు చేసుకొంటున్నారు. డ్రగ్స్ అమ్మి డబ్బు చేసుకొంటున్నారు. కంపెనీలు పెట్టి డబ్బు చేసుకొంటున్నారు. ఫారెన్ అల్లుడు అన్న క్రేజ్ ఉన్న ఏమనిషినో నన్ను కొనకా మానడు, నా భావి జీవితానికి red carpet వెయ్యకా మానడు. కొండకు వెంట్రుక కడుతున్నాను. వస్తే కొండ, పోతే వెంట్రుక. పెళ్ళి కొందరికి కష్టాల్ని తెస్తుంది. నాకు మాత్రం డబ్బుని తెస్తుంది. మీకు కంపెని తెస్తుంది.

ప్రేమతో,

నరసింహం.